క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నల్లగొండ విద్యుత్ ఏడీఈ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, అన్సారీకాలనీ ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నకిరేకల్ : చలికాలం దృష్టిలో పెట్టుకుని నకిరేకల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ ఆధ్వర్యంలో నీడ్ ఆస్ పీపుల్స్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక సాయి మందిరంలో గురువారం నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ జెల్లా దశరథ, జోన్ చైర్మన్ రావిరాల అశోక్, డిస్ట్రిక్ కమిటీ చైర్మన్ బొల్లం శోభాకృష్ణమూర్తి, ప్రతినిధులు ఎన్.రాంమోహన్‌రావు, అండెం వెంకటేశ్వర్లు, వరకాంతం నారాయణరెడ్డి, పోతుల రాములు, మాదగోని స్వామి, బొల్లం సత్తయ్య, ముప్పారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని స్రవంతి స్కూల్ విద్యార్థి జి.అఖిల్ జాతీయ హాకీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అఖిల్ జాతీయ పోటీలకు ఎంపికతో పాటు తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించనున్నాడు. ఈ నెల 27వ తేదీన మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీల్లో అఖిల్ పాల్గొననున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన అఖిల్‌ను గురువారం స్రవంతి స్కూల్ కరస్పాండెంట్ వారణాసి రజనీకాంత్ ఘనంగా సత్కరించారు.

కోమటిరెడ్డిని కలిసిన మోతె పిచ్చిరెడ్డి

నల్లగొండటౌన్: రాష్ట్ర రోడ్లు,, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని 5వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ పున్న గణేశ్ గురువారం హైదరాబాద్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గణేశ్ చేరికతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 31కి చేరింది. దాంతో నీలగిరి మున్సిపాలిటీ కౌన్సిల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి కాంగ్రెస్ బలం 33కు చేరింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు బోయినపల్లి శ్రీనివాస్, సమి, నాయకులు అల్లి సుభాష్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నకిరేకల్: నాబార్డు సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కే.మధుబాబు కోరారు. నకిరేకల్‌లోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సలహాలు, సూచనలు అందజేశారు. నాబార్డు జిల్లా మేనేజర్ వినయ్‌కుమార్, సహాయ పరిశోధన అధికారి రవీందర్‌నాయక్, ఐఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షుడు వాడపల్లి రమేష్, ప్రతినిధులు యంపల్ల దశరథరెడ్డి, భూపతి శ్రీను, చాగోని సైదమ్మ, అనిల్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనుల పరిశీలన

నల్లగొండ టూటౌన్: శ్మశానవాటిక పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువాలని మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని హిందూపూర్ శ్మశానవాటిక పనులను పరిశీలించారు. పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయన వెంట ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ, ఏఈ రవీందర్ ఉన్నారు.

అలంకారప్రాయంగా నిఘా నేత్రాలు

- జాతీయ రహదారిపై, గ్రామాల్లో ఏర్పాటు
- నిర్వహణ లోపంతో పలుచోట్ల రిపేర్లు



చిట్యాలలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

చిట్యాల: కొన్ని నెలల క్రితం చిట్యాల పట్టణంలో జాతీయ రహదారి సమీపంలో గల ఓ ఇంటిలో పట్టపగలు భారీ చోరీ జరిగింది. ఇంట్లోని సుమారు రూ.30 లక్షల విలువ గల బంగారు నగలు, ఐదు లక్షల రూపాయల నగదును దొంగలు చోరీ చేశారు. ఆ ఇంటి సమీపంతోపాటు సర్వీస్‌రోడ్డు వెంట ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను ఇప్పటివరకు పోలీసులు పట్టుకోలేకపోయారు. ఇంతేకాకుండా పట్టపగలు ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి ఇంట్లోని వృద్ధులపై బంగారు ఆభరణాల కోసం దాడి చేసిన సంఘటన సైతం చిట్యాలలో చోటు చేసుకుంది. కానీ సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులను పోలీసులు పట్టుకోలేకపోయారు. గుండ్రాంపల్లిలో పది రోజుల క్రితం తిరుపతికి దైవ దర్శనానికి ఓ కుటుంబం వెళ్లగా ఆ ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారం, నగదును ఎత్తుకెళ్లారు. ఆ ఇంటివారు తిరిగి వచ్చి చూసేంత వరకు చోరీ జరిగిన విషయం బయటకు రాలేదు. ఈ రెండు సంఘటనల్లో సీసీ కెమెరాలు పనిచేసినట్లయితే నిందితులను వెంటనే పట్టుకునే అవకాశం ఉండేది. జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మానిటరింగ్ వ్యవస్థ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంటుంది. కానీ సీసీ కెమెరాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నిందితులను పట్టుకోవడం కష్టతరంగా మారింది.

చిట్యాల మున్సిపాలిటీలో..

చిట్యాల మున్సిపాలిటీలోని ఏడు, తొమ్మిది, పదో వార్డుల్లో సీసీ కెమెరాలను పలువురు దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. వాటి మానిటరింగ్ వ్యవస్థ స్థానిక ప్రజాప్రతినిధులు చేపడుతున్నారు. ఏడు, తొమ్మిదో వార్డుల్లోని సీసీ కెమెరాలతోపాటు, పదో వార్డులో పలు సీసీ కెమెరాలు సరైన నిర్వహణ లేకపోవడంతో పనిచేయడం లేదు. అంతేకాకుండా స్థానిక పోలీసులు పలువురి సహకారంతో పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా, సర్వీస్‌రోడ్ల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సర్వీస్ రోడ్లు వెంట ఉన్న సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి.

పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ధ్వంసం

చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, గుండ్రాంపల్లి, పిట్టంపల్లి గ్రామాల్లో పలువురు దాతల సహకారంతో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చాలా వరకు పనిచేయడం లేదు. సరైన నిర్వహణ లేకపోవడం, వర్షం, గాలి దుమారాలతో పాటుగా కొంతమంది ఆకతాయిలు ఈ సీసీ కెమెరాలను ధ్వంసం చేస్తున్నారు. సీసీ కెమెరాల నిర్వహణకు పోలీస్‌శాఖతోపాటు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ప్రత్యేక నిధులు మంజూరు కావడం లేదు. దీంతో ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల నిర్వహణ భారంగా మారింది.

మిగిలిన గ్రామాల్లో..

చిట్యాల మండలంలోని వెలిమినేడు, పెద్దకాపర్తి గ్రామాల పరిధిలో ఇరవైకి పైగా వివిధ రకాల పరిశ్రమలున్నాయి. వీటిలో వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కార్మికులు పనిచేస్తూ ఆయా గ్రామాల్లో అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. ఈ గ్రామాల్లో సైతం దొంగతనాలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం పెద్దకాపర్తి గ్రామంలోని ఓ ఇంటిలో దొంగలు పడి ఇంట్లోని వస్తువులతోపాటు గ్యాస్ సిలిండర్ కూడా ఎత్తుకెళ్లారు. పట్టణాల్లో, గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులను గానీ, ప్రత్యేక ఉద్యోగిని గానీ కేటాయించి దొంగతనాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



గుండ్రాంపల్లిలో గత మూడు నెలల్లో ఐదు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. నిందితులను గుర్తించేందుకు గ్రామంలోని ముఖ్య కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తగిన నిర్వహణ లేక పనిచేయడం లేదు. అంతేకాకుండా గ్రామంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టి, మిగిలిన వీధుల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

–బొడిగె సైదులు గౌడ్, గుండ్రాంపల్లి

మెరుగైన పాలన అందించడం ఖాయం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఎర్ర రణీల

శాలిగౌరారం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పదేళ్ల మెరుగైన పాలన అందించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జెడ్పీటీసీ ఎర్ర రణీల అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తిరుమలగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌పై, కాంగ్రెస్ పాలనపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి, గాదరి కిశోర్‌కుమార్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. గాదరి కిశోర్‌కుమార్‌కు అటు అధికారం, ఇటు అక్రమార్జన దక్కకుండా పోయేసరికి స్థాయిని మరిచి మాట్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ప్రాణహాని తలపెట్టేందుకు గాదరి కిశోర్‌కుమార్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మందుల సామేల్‌కు ఎలాంటి ప్రాణహాని జరిగినా అందుకు పూర్తిబాధ్యత గాదరి కిశోర్‌కుమార్‌దే అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు బండారు మల్లయ్య, అల్లి సైదులు, ఎంపీటీసీలు నోముల జనార్దన్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, నాయకులు రామనర్సయ్య, శ్రీను, మల్లయ్య, బీరప్ప, అంజయ్య, సతీష్, పరమేశ్, నరేశ్, సైదులు, అనిల్, వెంకన్న, గణేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై రాజీలేని పోరాటం చేస్తాం



అభివాదం చేస్తున్న దివ్యాంగులు

మునుగోడు: ఎన్నికల్లో దివ్యాంగుల రిజర్వేషన్ వాటా తేల్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. మునుగోడులో గురువారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ నల్లగొండ ఎమ్మెల్యే టికెట్ బీసీలకు త్యాగం చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారని, కనీసం భువనగిరి ఎంపీ టికెట్ అయినా త్యాగం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి దివ్యాంగులకు దామాషా ప్రకారం పంచాయతీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్‌సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుడిపల్లి సుమతి, జిల్లా నూతన అధ్యక్షుడు తలారి సహదేవులు, ఉపాధ్యక్షుడు వంటెపాక ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

కనగల్: మండల పరిధిలోని జీ.ఎడవల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొరివి శంకర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ఏపీ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న జగన్ మరోమారు ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల వెంకన్న, కలుకూరి వెంకన్న, కాడింగు దేవేందర్, కర్నాటి సత్తి, కొర్వి లింగస్వామి, పోలే విజయ్‌కుమార్, మల్లెబోయిన సాయికుమార్, కొర్వి ప్రసాద్, కొర్వి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

మునుగోడు: ఈ నెల 26వ తేదీన సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. గురువారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు సురిగి చలపతి, గోసుకొండ లింగయ్య, బండమీది యాదయ్య, పాండు, ఈదులకంటి కైలాస్, దుబ్బ వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పండించిన పత్తితోపాటు వ్యవసాయ పనిముట్లు కాలిపోయి వీధిన పడిన మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని సొనబండకు చెందిన చిలుముల నర్సింహకు ఆ గ్రామస్తులు చందాలు వేసుకుని రూ.41వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. నాలుగు రోజుల క్రితం నర్సింహ పశువుల కొట్టం పూర్తిగా కాలిపోవడంతో గ్రామ పంచాయతీ పరిధిలోని రామకృష్ణపురం కాలనీ రైతులు చందాలు వేసుకుని గురువారం నగదు అందించి అండగా నిలిచారు.

శాలిగౌరారం: ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సమస్యతో నల్లగొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన గండమల్ల మదన్‌తేజకు నకిరేకల్ లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.20,200 అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, రాచమల్ల శ్రీను, ప్రవీణ్, శ్రీకాంత్, సైదులు, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన



అన్నప్రాసన చేస్తున్న సర్పంచ్ సుధాకర్‌నాయక్

మర్రిగూడ: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఖుదాబాక్షపల్లి సర్పంచ్ ఆంబోతు సుధాకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఖుదాబాక్షపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల వరకు తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని, అనంతరం అనుసంధాన ఆహారం కూడా బిడ్డలకు అందించవచ్చన్నారు. సూపర్‌వైజర్లు మిర్యాల పద్మ, ముమ్మడి యశోద, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, అంగన్‌వాడీ టీచర్ విజయ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

మునుగోడు: మహాలక్ష్మి పథకంతో ఉపాధి కరువై రోడ్డున పడ్డ ఆటో కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చాపల శ్రీను డిమాండ్ చేశారు. గురువారం మునుగోడులో ఆటో యూనియన్ నాయకులతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం రాక ముందు ప్రతి ఆటో డ్రైవర్ రోజుకు రూ.600 నుంచి రూ.800 ఆదాయం పొందేవారన్నారు. కానీ మహాలక్ష్మి పథకంలో మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం చేయడంతో రోజుకు కనీసం రూ.100 కూడా ఆదాయం రావడంలేదన్నారు. దీంతో ఆటోల కొనుగోలుకు ఫైనాన్స్‌లలో తెచ్చిన అప్పులు తీర్చలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఎండీ. జానిమీయా, బండారు శంకర్, పోలగోని భిక్షం, నర్సింహ, నరేందర్ నాగరాజు, వెంకన్న, రాంబాబు, బొడ్డు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి

నల్లగొండటౌన్: నియోజకవర్గంలో దళిత బంధు పథకానికి ఎంపికై న 1055 మందికి వెంటనే యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద లబ్ధిదారులతో కలిసి జెండాలు పట్టుకుని నిరసన తెలియజేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినందున ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బకరం శ్రీనివాస్, కంచనపల్లి విమలమ్మ, అద్దంకి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఈసారైనా చర్చ జరిగేనా !

- నేడు కేతేపల్లి మండల సర్వసభ్య సమావేశం
- ప్రభుత్వం మారడంతో అందరిలో ఆసక్తి



కేతేపల్లి మండల పరిషత్ కార్యాలయం

కేతేపల్లి: మండలంలోని సమస్యలు చర్చించి వాటి పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ఈసారైనా సజావుగా సాగేనా అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. కేతేపల్లి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో ఈసమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సక్రమంగా హాజరు కాకపోవడంతో ప్రతిసారి సర్వసభ్య సమావేశం మొక్కుబడిగానే సాగుతోంది. ఎజెండాలోని అంశాలపై సమగ్రంగా చర్చించకుండా అధికారులు తమ నివేదికలు చదవడం, సభ్యులు వినడమే తంతుగా మారింది. విద్యుత్‌శాఖపై చర్చ జరిగినపుడు మాత్రమే ఒకరిద్దరు సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామంలోని సమస్యలను సభ దృష్టికి తెచ్చేవారు. మిగతా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగేటప్పుడు సభ్యులు ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అయితే ఈసారి కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో సమస్యలపై చర్చ ఎలా జరుగుతుందో అని ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

మీసేవ కేంద్రం లేక ఇక్కట్లు

కేతేపల్లి మండలానికి గతంలో ఒకే ఆధార్ సెంటర్‌ను తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మండలంలోని 16 గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచే ఆధార్ సేవలు పొందేవారు. కాగా నిర్వాహకులు నిబంధనలు పాటించక పోవడం, తిరస్కరించే దరఖాస్తులు ఎక్కువగా వస్తున్న కారణంగా ఉన్నతాధికారులు రెండేళ్ల క్రితం ఆధార్ సెంటర్ ఐడీని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత నేటివరకు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ అందుబాటులోకి రాలేదు. ఆధార్‌లో ఏ చిన్న మార్పు చేయాలన్నా మండల ప్రజలు ఇక్కడి నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న నకిరేకల్, 15 కి.మీ దూరంలో ఉన్న సూర్యాపేట పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో దూరభారం కావడంతోపాటు విలువైన సమయం, రవాణా చార్జీలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇక్కడ ఆధార్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చేలా సభ్యులు సమావేశంలో చర్చించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

కేతేపల్లి మండలంలోని చాలా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. కొన్ని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు శంకుస్థాపనలు చేశారు. కానీ ఒక్కచోట కూడా పనులు మొదలు కాలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో రోడ్ల అభివృద్ధి పనులు ఎప్పుడు మొదలు పెడతారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు కాలేదు. వాటిపై సభ్యులు ఏం చర్చిస్తారో చూడాలి. వాటితోపాటు గ్రామాల్లో ప్రధానంగా విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, సీజనల్ వ్యాధులు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, రేషన్ కార్డుల మంజూరు, ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలపై సర్వసభ్య సమావేశంలో సమగ్ర చర్చ జరగాలని ప్రజలు కోరుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం త్వరలో ముగియనుంది. కాబట్టి వారికి ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావొచ్చు. ఈనేపథ్యంలో శుక్రవారం జరగనున్న సమావేశంలో సర్పంచులు తమ గ్రామాల సమస్యలపై ఏమేరకు చర్చిస్తారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సమస్యలు పరిష్కారం కావడం లేదు



గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అధికారులు దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న మండల సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. గత సమావేశాల్లో చేసిన తీర్మానాలపై సమీక్షం జరగడం లేదు. మండల స్థాయి అధికారులు మినహా జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాజరు కావడం లేదు. దీంతో సమస్యలు చెప్పుకున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు.

– ఎల్ల సంధ్య, ఎంపీటీసీ, కొర్లపహాడ్

పరిశ్రమ విస్తరణ నిలిపివేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాగరాజు

చిట్యాల: వెలిమినేడు గ్రామ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణ నిలిపివేయాలని కోరుతూ ఆ గ్రామ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం చైర్మన్ బైకాని నాగరాజుయాదవ్ గురువారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే వెలిమినేడు గ్రామంతోపాటు చుట్టుపక్కల ఉన్న మరో నాలుగైదు గ్రామాలకు వాయు, జల కాలుష్యం పెరుగుతుందన్నారు. ఆయన వెంట ఏర్పుల శ్రీశైలం, దుర్గం లింగస్వామి, మధ్యపురం శ్రీశైలం, వెంకటేష్, స్వామి, మల్లేష్, అంజయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వెలిమినేడు గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సేకరించిన అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చేందుకుగాను రైతులకు సహకరించాలని, ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణ నిలిపివేయాలని కోరుతూ వెలిమినేడు మండల సాధన సమితి అధ్యక్షుడు పోలగోని శివప్రసాద్ గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు శివప్రసాద్ పేర్కొన్నారు.

పచ్చల సోమేశ్వరాలయంలో పడిపూజ



శివలింగానికి అభిషేకం చేస్తున్న శివ భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పచ్చల సోమేశ్వరాలయంలో 6వ జ్యోతిర్లింగాల పడిపూజ మహోత్సవాన్ని గురువారం శివ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కన్నారా గురుస్వామి ఆధ్వర్యంలో భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి చాపల యాదయ్య, సురిగి శంకర్, లింగరాజు, నల్లబోతు శంకర్, గోపిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై నిరసన

నల్లగొండ టూటౌన్: ఉప రాష్ట్రపతి పట్ల అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేపీ నాయకులు నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. వీరెల్లి చంద్రశేఖర్, కంకణాల నాగిరెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాయం భూపాల్ రెడ్డి, రావెళ్ల కాశమ్మ, పాలకూరి రవి, కాలం విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



మహాలక్ష్మి (ఫైల్)

మర్రిగూడ: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పదో తరగతి విద్యార్థిని బుధవారం రాత్రి మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన తుప్పరి సత్తయ్య–అనిత దంపతుల కుమార్తె తుప్పరి మహాలక్ష్మి(15) మర్రిగూడ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. 15రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో గాంధీ ఆస్పత్రితోపాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ జ్వరమని తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహాలక్ష్మి మృతిచెందింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరుడు అంజయ్యతోపాటు ఉపాధ్యాయ బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్ఓ కృష్ణకుమారిని వివరణ కోరగా జిల్లాలో నేటి వరకు ఎలాంటి డెంగ్యూ మరణాలు నమోదు కాలేదన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగ్యూ అని నిర్ధారిస్తే పరిగణలోకి రాదన్నారు. శ్రీపగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు మహాలక్ష్మి తండ్రి సత్తయ్యను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ఫౌండేషన్ సభ్యులు మాద్గుల శిరీష, పగడాల కల్యాణ్, కిషన్, శ్రీను, పాపయ్య, గణేష్ ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

నల్లగొండ రూరల్: కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా నల్లగొండ మండలంలోని పెద్దసూరారం హైస్కూల్‌లో 9,10 తరగతుల విద్యార్థులకు గ్రామస్తులు ఏడుదొడ్ల కొండల్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి గురువారం నోటుబుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మారం గోనారెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పిల్లి యాదగిరి, పెండెం రత్నమాల, పాండు, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, విజయ్‌కుమార్, సత్యబాబు, రమేష్, వనజాత, సైదులు, కృష్ణయ్య పాల్గొన్నారు.